
ప్రజాశక్తి
గురువారం 1 ఆగస్టు 2024
పార్వతీపురం మన్యం



నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఈ నెల ఒకటో తేది నుంచి ఏడో తేది వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.విజయ పార్వతి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సంవత్సరం 'అంతరం మూసివేయడం: అందరికీ తల్లిపాల మద్దతు' థీమ్‌తో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివిధ రంగాలకు చెందిన వ్యక్తులను తల్లిపాలు ఇవ్వడానికి ఆటంకం కలిగించే కారకాలను తొలగించడం, తల్లులకు మద్దతు ఇవ్వడంలో సహకారాన్ని పెంపొందించేలా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. తల్లిపాలను కొనసాగించడం ఆవశ్యమని చెప్పారు.



దమ్ము మడిలా తయారైన యు.వెంకంపేట గ్రామ రహదారి

గ్రామీణ ప్రాంతాల రహదారుల అభివృద్ధికి కృషి చేస్తామని సమయం వచ్చినప్పుడల్లా హామీలిస్తున్న పాలకులు ఉపన్యాసాలకే పరిమితం అవుతున్నారు. అంతే తప్ప ఆచరణలో ఎక్కడా కానరావడం లేదు. మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులను పరిశీలిస్తే ఆ విషయం అర్థమవుతుంది. రోడ్లన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఏళ్ల తరబడి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. పర్యావసానంగా మండల ప్రజలకు ఏళ్ల తరబడి అవస్థలు తప్పడం లేదు.

రహదారి ఇలా..
రాకపోకలు ఎలా?

- అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులు
- ప్రజలకు తప్పని అవస్థలు
- పట్టించుకోని పాలకులు
- ఇదీ వీరఘట్టం మండలంలో రోడ్ల పరిస్థితి



రాళ్లు తేలిన చిదిమి గ్రామ రహదారి

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని కాగితాడ, చేబియ్యంవలస, డిపి వలస, పెదగదబవలస, బల్లగుడ్డ, కె.ఇచ్ఛాపురం, రాయిమానుగూడ, తదితర గ్రామాల రహదారులు అధ్వానంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా రహదారులు దమ్ము పొలాల్లో తయారవుతున్నాయి. వర్షపు నీరు రహదారిపై గుంతల్లో నిలిచిపోవడంతో చెరువులను తలపిస్తున్నాయి. ఈ రహదారులపై ప్రయాణం చేయాలంటే సాహసం చేయాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్లకు వెళ్లేదెలా?

వీరఘట్టం మండల కేంద్రంలోని ఎల్లంకివీధి వాసులు ఇళ్లకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరఘట్టంలో ప్రధాన రహదారి విస్తరణ పనులు చేపట్టక ముందు రాకపోకలు సాగించేందుకు మార్గం ఉండేది. రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా పెద్ద కాలువలు నిర్మించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఇళ్లకు చేరుకునే రహదారి బురదమయం అయింది. దీంతో రాకపోకలు సాగించేందుకు ఎల్లంకివీధి వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లకు వెళ్లే రహదారిలో పెద్ద కాలువ నిర్మించడంతో మార్గం లేకుండా పోయిందని, మెట్లు ఏర్పాటు చేస్తే కొంతమేర సమస్య పరిష్కారం అవుతుందని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎల్లంకి వీధి వాసులు కోరుతున్నారు.

ముందుకు సాగని పనులు

మండలంలోని సిఎస్‌పి రహదారి నుంచి యు.వెంకంపేట మీదుగా చిదిమి వరకు గత టిడిపి ప్రభుత్వ హయాంలో సుమారు రూ.కోటి అంచనా వ్యయంతో రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. హుస్సేన్‌పురం వద్ద తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ఏడో బ్రాంచ్ నుంచి నీలంపేట, ఎలిషపురం, సంధమానుగూడ వరకు రూ 4.65 కోట్లతో రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. పివిఆర్ పురం నుంచి డిపివలస, తూడి గ్రామాలకు రూ.5.4 కోట్లతో బిటి రహదారి నిర్మించేందుకు పనులు చేపట్టారు. గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో టిడిపి హయాంలో ప్రారంభించిన పనులేవీ పూర్తి చేయక అసంపూర్తిగా వదిలేసింది.

మరమ్మతులకు నోచక

మండలంలో కంబర, ఎం.రాజపురం, చిట్టిపూడివలస, చిదిమి, కొట్టుగుమ్మడ గ్రామాల రోడ్లకు మరమ్మతుల కోసం ప్రతిపాదించారు. వైసిపి అధికారంలోకి వచ్చాక మరమతులకు నోచుకోలేదు. ఎన్నికల సమయంలో చిదిమి, చిట్టిపూడివలస, గ్రామాలకు బిటి రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ఆగమేఘాలపై పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఆ గ్రామ రహదారులు అర్ధాంతరంగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం ఈ రహదారులు రాళ్లుతేలి దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా పాలకుల స్పందించి గ్రామీణ ప్రాంతాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, రహదారుల అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు ఇంటింటికీ పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

జిల్లాలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు గురువారమే పంపిణీకి జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఇప్పటికే కంట్రోల్ రూం సైతం ఏర్పాటు చేసింది. జిల్లా అధికారులను మండల ప్రత్యేక అధికారులుగా నియమించారు. ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. జిల్లాలో ఒకటో తేదీ ఉదయాన్నే పింఛన్లు పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో 1,43,398 పింఛన్లు ఉన్నాయని, వీటికి రూ.59.58 కోట్లు పంపిణీ చేస్తామని చెప్పారు. కదలలేక మంచానికే పరిమితమైన వారికి మొదటగా పంపిణీ చేయుటకు ఏర్పాట్లు చేశామన్నారు. సచివాలయ సిబ్బంది, వెలుగు ఎపిఎంలు, సిసిలు తదితరులను ఇందులో భాగస్వామ్యం చేశామని చెప్పారు. మొదటి రోజునే శత శాతం పంపిణీకి చర్యలు చేపడుతున్నామని వివరించారు. అనివార్య కారణాల వల్ల ఏమైనా మిగిలితే రెండో రోజు పంపిణీ చేస్తారని వెల్లడించారు. మొదటి రోజునే ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్లు పొందాలని లబ్ధిదారులకు విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. గ్రామాల వారీగా సిబ్బంది మ్యాపింగ్ ఇప్పటికే పూర్తి చేశారని, ఎక్కడా ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పింఛన్ల పంపిణీని స్వయంగా తనిఖీ చేస్తామని చెప్పారు.

విఆర్ఎస్ నీరు విడుదల

ప్రజాశక్తి-మక్కువ

వెంగళరాయసాగర్ జలాశయం నుండి పంటలకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి నీటిని విడుదల చేశారు. జలవనరుల శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా మక్కువ మండలంలో జలాశయం వద్ద బుధవారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఎకరాకు నీటి సౌకర్యం కల్పించాలని ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ప్రభుత్వం సకాలంలో విత్తనాలు, ఎరువులు అందిస్తుందని చెప్పారు. జైకా నిధులతో ప్రాజెక్ట్ ఆధునీకరణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. హెడ్ వర్క్స్‌లో మట్టికట్ట, రక్షణగోడ, జనరేటర్ రూమ్, గేట్ల మరమ్మతులు, ప్రధాన కాలువ తూముల మరమ్మతులు చేసినట్లు తెలిపారు. కాలువల్లో 38.545 కి.మీ లైనింగ్



ప్రాజెక్టు నీటిని విడుదల చేస్తున్న మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు

పనులకు దాదాపు 9 కి.మీ లైనింగ్ పనులు చేపట్టినట్లు చెప్పారు. దీని వల్ల అనవసర లీకులు లేకుండా వృథా నీటిని అరికట్టి చివరి భూములకు నీరు సమృద్ధిగా అందించుటకు అవకాశం ఉంటుందని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో బొబ్బిలి, పార్వతీపురం ఎమ్మెల్యేలు బేబినాయన, బోనెల విజయచంద్ర, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీరు వై.రాజరాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఇదీ విఆర్ఎస్ పరిస్థితి

విఆర్ఎస్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 1.683 టిఎంసిలు. 24,700 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేయాలి. జలాశయం కింద మక్కువ మండలంలో 14,798 ఎకరాలు, బొబ్బిలి మండలంలో 6178 ఎకరాలు, సీతానగరం మండలంలో 3724 ఎకరాలు సాగవుతోంది. కుడి ప్రధాన కాలువ ద్వారా 16,150 ఎకరాలకు, ఎడమ ప్రధాన కాలువ ద్వారా 8550 ఎకరాలకు నీరు సరఫరా అవుతుంది. ప్రస్తుతం జలాశయంలో 1.25 టిఎంసిల నీరుంది.

తహశీల్దార్లకు పోస్టింగులు

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

పార్వతీపురం మన్యం జిల్లాలో 20 మంది తహశీల్దార్లకు పోస్టింగులు ఇస్తూ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో జిల్లాలోని తహశీల్దార్లను ఇతర ప్రాంతాలకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. వారంతా గత వారం జిల్లాకు తిరిగిరాగా, కలెక్టర్ పోస్టింగులు ఇచ్చారు.

మండలం	తహశీల్దార్
పార్వతీపురం	జివి జనార్దన్
సీతానగరం	పి.అప్పలరాజు
బలిజిపేట	ఉమామహేశ్వరరావు
భామిని	పి.సోమేశ్వరరావు
సీతంపేట	ఎం.అప్పారావు
పాచిపెంట	డి.రవి
కురుపాం	ఎం.రమణమ్మ
పాలకొండ	బాలమురళీకృష్ణ
గరుగుబిల్లి	ఎం.భుజంగరావు
కొమరాడ	జె.రాములమ్మ
గుమ్మలక్ష్మీపురం	ఆర్.రమేష్‌కుమార్
జియ్యమ్మవలస	సీతారామయ్య
కలెక్టరేట్ ఎఒ	ఎం.సావిత్రి
ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ	ఎస్.నరసింహమూర్తి
సెక్షన్ సూపరింటెండెంట్లు	
సి-సెక్షన్	సిహెచ్.రాధాకృష్ణ
ఇ,ఎఫ్,జి-సెక్షన్	జి శ్రీరామ్మూర్తి
డి, హెచ్-సెక్షన్	శివన్నారాయణ
కెఆర్‌ఆర్‌సి స్పెషల్ తహశీల్దార్లు	
పార్వతీపురం	ఎస్.భాస్కరరావు
పాలకొండ	వి.రామస్వామి

షాపు అద్దె గోల్‌మాల్‌పై రభస

మున్సిపల్ సమావేశంలో భగ్గుమన్న కౌన్సిలర్లు ● విచారణ చేపట్టాం.. షాపు ఖాళీగా ఉంది : చైర్‌పర్సన్

ప్రజాశక్తి-సాలూరు

ప్రశాంతంగా ప్రారంభమైన సాలూరు మున్సిపల్ సాధారణ సమావేశం.. చివరికి చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ వర్సెస్ కౌన్సిలర్లు అన్న రీతిలో వాదోపవాదాలతో ముగిసింది. వైసిపి పాలకవర్గ సభ్యుల మధ్య నెలకొన్న గ్రూపు రాజకీయాలకు మరోసారి సమావేశం వేదికైంది. సమావేశంలో చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ ఏకాకిగా మిగిలిన పరిస్థితి ఏర్పడింది. సమావేశం ప్రారంభం కాగానే అజెండాలోని అంశాలను కౌన్సిలర్లు ఆమోదించారు. అనంతరం వైసిపి, టిడిపి కౌన్సిలర్లు ప్రశ్నోత్తరాల సమయంలో షాపు నంబర్ 20 అద్దె గోల్‌మాల్ వ్యవహారం, డీజిల్ దుర్వినియోగం వంటి అంశాలను ప్రస్తావించారు. వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు మాట్లాడుతూ మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని, వాహనాలకు డీజిల్ వినియోగానికి సంబంధించి బిల్లుల్లో చేతివాటం గురించి ప్రశ్నించారు. దీనిపై శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ పకీర్‌రాజు మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ విభాగంలో వాహనాల డీజిల్ బిల్లులు సక్రమంగా ఉన్నాయని, మిగిలిన విభాగాల్లో డీజిల్ వాడకం గురించి తనకు తెలియదని సమాధానమిచ్చారు. తర్వాత వైస్ చైర్మన్లు అప్పలనాయుడు, జర్జాపు దీప్తి, కౌన్సిలర్లు రాపాక మాధవరావు, గొర్లి వెంకటరమణ, గిరి రఘు, బలభద్రుని శ్రీనివాసరావు.. షాపు నంబర్ 20 అద్దె గోల్‌మాల్ వ్యవహారంపై ఇన్‌ఛార్జి ఆర్‌ఒ రాఘవాచార్యులు, కమిషనర్ ప్రసన్నవాణిని నిలదీశారు. సమావేశం జరుగుతున్నప్పుడు ఆర్ఐ శ్రీనివాసరావు ఎందుకు సెలవు పెట్టారని ప్రశ్నించారు. షాపు అద్దె ఎవరి జేబుల్లోకి వెళ్ళిందో తేల్చాలని పట్టుబట్టారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపు నంబర్ 20ని 2017 నుంచి పట్టణానికి చెందిన నాగోలు వెంకట్రావు వాడుకుంటున్నారని, అద్దె ఎందుకు వసూలు చేయడం లేదని టిడిపి కౌన్సిలర్లు



అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిల్ సభ్యులు

వి.హర్షవర్ధన్, టి.లక్ష్మోజీ నిలదీశారు. మున్సిపల్ ఖజానాకి దక్కాల్సిన 11.5 లక్షల రూపాయలు వసూలు చేయడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. మున్సిపల్ అధికారులకు ఈ వ్యవహారంలో ప్రమేయం ఉందేమోనన్న అనుమానాలు తలెత్తుతున్నాయని చెప్పారు. అద్దె వ్యవహారంపై విచారణ జరిపించామని, షాపు ఖాళీగా ఉందని నిర్ధారణ అయిందని చైర్ పర్సన్ ఈశ్వరమ్మ చెప్పారు. ఈ వ్యవహారంలో అవినీతి జరగలేదని, కౌన్సిలర్లు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని ఎదురుదాడి చేశారు. దీంతో కౌన్సిలర్లంతా ఆమెతో వాగ్వాదానికి దిగారు. అద్దె వ్యవహారంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, అవసరమైతే ఎసిబికి ఫిర్యాదు చేస్తామని కౌన్సిలర్లు చెప్పారు. ఈ విషయంపై కౌన్సిలర్లు మాట్లాడుతుండగానే చైర్‌పర్సన్ బయటకు వెళ్లిపోయారు.

పోలీసులు, మీడియా సమక్షంలో షాపు తెరిపించిన కౌన్సిలర్లు

అనంతరం కౌన్సిలర్లు, వైస్ చైర్మన్లు కమిషనర్ ప్రసన్న వాణి, ఆర్‌ఒ రాఘవాచార్యులును చుట్టుముట్టి అద్దె గోల్‌మాల్ వ్యవహారంపై నిలదీశారు. షాపు ఖాళీగా ఉందో, లేదో తేలాలంటే దాని తెరిచి చూడాలని డిమాండ్ చేశారు. తాళాలు ఆర్ఐ వద్ద ఉన్నాయని, ఆయన సెలవులో ఉన్నారని ఆర్‌ఒ రాఘవాచార్యులు చెప్పారు. తాళాలు పగులకొట్టి షాపు తెరవాలని కౌన్సిలర్లు పట్టుబట్టారు. దీంతో కమిషనర్ ప్రసన్నవాణి.. టౌన్ పోలీసులను పిలిపించి, మీడియా సమక్షంలో షాపు తాళాలను పగులకొట్టేందుకు అనుమతించారు. వెంటనే కౌన్సిల్ సభ్యులు.. ఆర్‌ఒ సమక్షంలో షాపు తాళాలను పగులకొట్టించారు. ఆ షాపు యజమాని నాగోలు వెంకట్రావు స్వాధీనంలో, ప్రస్తుతం వినియోగంలో ఉన్నట్లు నిర్ధారించారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ చెప్పిన విధంగా షాపు ఖాళీగా లేదని, యజమాని స్వాధీనంలో ఉందని రుజువైంది. అయితే నెలనెలా దాని అద్దె డబ్బులు ఎవరి ఖాతాలోకి వెళుతున్నాయనేది తేలాల్సి ఉంది. షాపు యజమాని నాగోలు వెంకట్రావు పేరిట పదివేల రూపాయలు డిపాజిట్ చెల్లించినట్లు ఆధారాలు కనిపిస్తున్నాయి.



షాపు తాళాలు తెరిపిస్తున్న కౌన్సిల్ సభ్యులు

పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికలకు
నేడు నోటిఫికేషన్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పాఠశాలల యాజమాన్య కమిటీల ఎన్నికలకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసిందని, గురువారం నోటిఫికేషన్ వస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ తెలిపారు. తల్లిదండ్రుల కమిటీల పేరును యాజమాన్య కమిటీలుగా మార్పు చేసినట్లు చెప్పారు. ప్రస్తుత కమిటీల పదవీ కాలం జులైతో ముగియనుండడంతో ఆగస్టులో ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించినట్లు తెలిపారు. కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ఎన్నికలకు గురువారం ఉదయం 10 గంటలకు నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం 2 గంటలకు ఓటర్ల జాబితాను నోటీసు బోర్డులో ఉంచుతారని తెలిపారు. ఈ నెల 5న ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారని తెలిపారు. అదే రోజు సాయంత్రం 3-4 గంటల మధ్య తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారని చెప్పారు. 8న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి, మొదటి సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

బడిదేవరకొండపై యంత్రాల అడ్డగింత

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మండలంలోని ములగ పంచాయతీ పరిధిలోని బడిదేవర కొండపై ఏడేళ్ల క్రితం గ్రానైట్ తవ్వకాలు చేపట్టగా, గిరిజనులు వ్యతిరేకించడంతో తవ్వకాలు ఆగాయి. బుధవారం మళ్లీ గ్రానైట్ తవ్వకాల కోసం గుర్తుతెలియని వ్యక్తులు భారీ వాహనాలను తవ్వకాల నిమిత్తం తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక గిరిజనులు వాహనాలను అడ్డగించారు. వాహనాలకు సంబంధించిన వ్యక్తులు ఎవరూ ఘటనా స్థలానికి చేరుకోలేదు. తవ్వకాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నేడు టిడిపి నియోజకవర్గ సమావేశం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలంలోని చినమేరంగి కోటలో గురువారం టిడిపి నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. ఐదు మండలాల్లో ఉన్న కన్వీనర్లు, కార్యదర్శులు, క్లస్టర్ కోఆర్డినేటర్లు, ఇన్‌ఛార్జులు హాజరు కావాలని కోరారు.



నిరసన తెలుపుతున్న రైతుసంఘం నాయకులు, రైతులు

కేంద్ర బడ్జెట్‌పై నిరసన

ప్రజాశక్తి-పాచిపెంట

వ్యవసాయ రంగానికి తీవ్రంగా నష్టం చేసే కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఎపి రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మాదిరెడ్డి తిరుపతినాయుడు, బోను గౌరు నాయుడు ఆధ్వర్యంలో పాచిపెంటలో బుధవారం నిరసన తెలిపారు. అనంతరం బడ్జెట్ కాపీని దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి తీవ్రంగా నష్టం చేసేలా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయని విమర్శించారు. కనీస మద్దతు ధర కల్పించి పంటలను కొనుగోలు చేసే చర్యలు లేవని మండిపడ్డారు. ఉపాధి హామీ, పిఎం కిసాన్, పిఎం పసల్ బీమా యోజన పథకాలకు మధ్యంతర బడ్జెట్లో కేటాయించిన దానికంటే ఎక్కువ కేటాయింపులు ప్రకటించలేదని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌ను రైతులంతా తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. నిరసనకు సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎం.ఆదినారాయణ, లంఖ్యాన రామ్మూర్తి, రఘుపాత్రుని రామ్మూర్తినాయుడు, పైల అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను సన్మానించారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, ట్రైబల్ రైట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బ లోవరాజు, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, జియ్యమ్మవలస ఎంపిపి బొంగు సురేష్, కొమరాడ మండల కన్వీనర్ శేఖర్ పాత్రుడు, డంగభద్ర సర్పంచ్ జోగి భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ఉపాధిలో అడుగడుగునా అక్రమాలు

సామాజిక తనిఖీలో బృందం వెల్లడి

ప్రజాశక్తి-కురుపాం

మండలంలోని 23పంచాయతీలలో 2023 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు గ్రామీణ ఉపాధి హామీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులపై సామాజిక తనిఖీ బృందం తనిఖీలు చేపట్టింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం డ్వామా పీడీ రామచంద్రరావు ఆధ్వర్యాన నిర్వహించిన ప్రజా వేదికలో ఈ సందర్భంగా తనిఖీ బృందం గుర్తించిన అక్రమాలను బహిర్గతం చేసింది. మంలంలో ఉపాధి హామీ ద్వారా 2862 పనులకు వేతనదారులకు 16కోట్ల 96లక్షల 43వేల 325, మెటీరియల్ 7కోట్ల 34లక్షల7వేల 852 రూపాయలు ఖర్చు చేసినట్లు బృందం సభ్యులు తెలిపారు. పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా చేపట్టిన 20పనులకు సంబంధించి వేతనదారులకు రూ.1528, మెటీరియల్‌కు రూ. 8కోట్ల77లక్షల 4వేల 814, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా చేపట్టిన 23 అభివృద్ధి పనులకు వేతనదారులకు రూ.779, మెటీరియల్ 18కోట్ల 30లక్షల76వేల740 రూపాయలు ఖర్చుపై



నివేదికను వెల్లడిస్తున్న సామాజిక తనిఖీ బృందం సభ్యులు

సామాజిక తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎవెన్యూ ప్లాంటేషన్ లో నాటిన మొక్కలు లేవని, క్షేత్ర సహాయకులు రికార్డు నిర్వహణ సక్రమంగా లేదని, పనులకు వేసే మస్తరులో వ్యత్యాసం, ఒకరికి బదులు ఒకరు పనికి హాజరు, పనికి హాజరైన వారు కంటే అధికంగా పేరు నమోదు మొదలైన అంశాలను గుర్తించారు. ఇతర అక్రమాలపై సమగ్రమైన నివేదిక డ్వామా పీడీకి సమర్పించ నున్నట్లు తెలిపారు. కురుపాం మేజర్ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులపై సమగ్రమైన దర్యాప్తు చేపట్టాలని టిడిపి నాయకులు కోలా రంజిత్ కుమార్, జివి రమణమూర్తి , కెవి కొండయ్య కోరారు. స్పందించిన డ్వామా పీడీ రామచంద్రరావు సమగ్ర దర్యాప్తు నిర్వహించి నివేదిక ఇవ్వాలని ఎంపిడిఒ ఎస్.అప్పారావును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి సభ్యులు సుజాత, సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పిలు దాసు, మాధవరావు, ఎపిఒ పి.బావాజీ, ఇసి మూర్తి, ఉపాధి హామీ, పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొలువుదీరిన తహశీల్దార్లు

ప్రజాశక్తి-సీతానగరం

సీతానగరం తహశీల్దార్‌గా పి.అప్పలరాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో హెచ్‌డిటి ఉమామహేశ్వరరావు, ఆర్‌ఐ ఎన్.శ్రీనివాసరావు, విఆర్‌ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురం మండల తహశీల్దారుగా ఆర్.రమేష్‌కుమార్ నియమితులయ్యారు. ఆయన కొమరాడ తహశీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి రానున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన రామారావు బదిలీపై విశాఖపట్నం జిల్లాకు వెళ్లారు.

వీరఘట్టం : వీరఘట్టం మండల తహశీల్దార్‌గా సిహెచ్ సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు విధులు నిర్వహించిన కె.జయప్రకాశ్ బదిలీపై వెళ్లిపోయారు. డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ అదనపు బాధ్యతలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

జగన్‌ని కలిసిన గుల్లిపిల్లి గణేష్

ప్రజాశక్తి-సాలూరు


మాజీ సిఎం జగన్‌తో గుల్లిపల్లి గణేష్

మాజీ సిఎం, వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం వైసిపి జిల్లా నాయకులు, జిసిసి మాజీ చైర్ పర్సన్ శోభా స్వాతీరాణి భర్త గుల్లిపిల్లి గణేష్ కలిశారు. తాడేపల్లిలో ఆయన నివాసంలో జగన్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. స్వాతీరాణి గత ఎన్నికల్లో అరకు ఎమ్‌పి స్థానానికి పోటీ చేయాలని భావించారు. అయితే అక్కడ సమీకరణల నేపథ్యంలో ఆమెకు సీటు దక్కలేదు.

పిచ్చిమొక్కలు తొలగింపు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

భద్రగిరి ఆర్‌ఐటిఐ ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను సిబ్బంది శ్రమదానం చేసి తొలగించారు. 'శిథిలావస్థలో ఆర్‌ఐటిఐ' అనే కథనం ప్రజాశక్తిలో బుధవారం రావడంతో వారు స్పందించారు. ఐటిఐ వసతిగృహం ముందు, వెనుక భాగంలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఐటిఐ లోపల భాగంలో ఉన్న గదుల్లో బ్లీచింగ్ వేసి, క్లోరినేషన్ చేపడతామని ప్రిన్సిపల్ సిహెచ్ సునీల్ కుమార్ తెలిపారు.

ఐటిడిఎ పిఒను కలిసిన సర్పంచ్ జగ్గారావు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం ఐటిడిఎ పిఒ సేతు మాధవన్‌ను తాడికొండ సర్పంచ్ మండంగి జగ్గారావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధానంగా రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలను మెరుగు పరచాలని పిఒను కోరారు. సమస్యలపై స్పందించిన పిఒ తాడికొండ పంచాయతీని సందర్శించి, సమస్యలు పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు.

శిక్షణను వినియోగించుకోండి

ప్రజాశక్తి - కురుపాం

వానపాము ఎరువుల తయారీ, ఇతర అంశాలపై వ్యవసాయ కళాశాల విద్యార్థులకు ఇస్తున్న మూడు రోజుల నైపుణ్య ఆధారిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కెవికె సమన్వయకర్త సన్యాసి ధ్రువ అన్నారు. బుధవారం రస్తాకుంటుబాయి కెవికెలో విద్యార్థులకు వానపాము ఎరువు తయారీ, వాటి రకాలపై శిక్షణ ఇచ్చారు. విచక్షణా రహితంగా రసాయన ఎరువు వాడితే భూసమతుల్యత దెబ్బతిని ఉత్పాదకత తగ్గిపోతుందన్నారు. అనంతరం వానపాము ఎరువు వల్ల కలిగే ప్రయోజనాలను గూర్చి వివరించారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు శ్రీనివాసరాజు, అమృతవీణా, స్రవంతి, అను, ఉమాజ్యోతి, అనంతవిహారి పాల్గొన్నారు.

'ప్రజలకు అండగా ఉంటాం'

ప్రజాశక్తి-వీరఘట్టం

జనసేన పార్టీ ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటుందని ఆ పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సంయుక్త కార్యదర్శి జనసేన జానీ, పాలకొండ నియోజకవర్గ సమన్వయకర్త నిమ్మల నిబ్రమ్ అన్నారు. బుధవారం శ్రీకాకుళంలోని జెమ్స్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న తూర్పుకాపు సంఘం కార్యదర్శి తట్టికల వెంకటరమణకు రక్తం అవసరమని వైద్యులు చెప్పడంతో సంయుక్త కార్యదర్శి జానీ స్పందించి సీతంపేట మండలానికి చెందిన జన సైనికుడు కె.సాయితో రక్తదానం చేయించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తామని జానీ తెలిపారు.

గ్రామాల్లో స్ప్రేయింగ్

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో మారుమూల గిరిజన ప్రాంతమైన మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న పూతికవలస, చింతమాను కాలనీ గ్రామాల్లో దోమల నివారణ మందును స్ప్రేయింగ్ చేశారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి జె.మోహన్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జ్వరాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి శివాజీ, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


వరుస పద్ధతిలో నాట్లు వేయిస్తున్న ఎఒ అవినాష్

వరుస నాట్లతో అధిక దిగుబడి

ప్రజాశక్తి-సీతానగరం

వరిలో వరుస నాట్లతో అధిక దిగుబడి సాధించవచ్చని ఎఒ ఎస్.అవినాష్ తెలిపారు. మండలంలో సూరంపేట గ్రామంలో మేడిశెట్టి వెంకటేశ్వరరావు పొలంలో తాడు ఉడుపు పద్ధతిలో వరినాట్లు వేయడంపై అవగాహన కల్పించారు. దీనివల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా తగిలి చీడపీడల ఉధృతి తగ్గుతుందని చెప్పారు. కార్యక్రమంలో విఎఎ సునీత పాల్గొన్నారు.

జీతాలు వెంటనే ఇప్పించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ ఆసుపత్రిల్లో, వైద్య కళాశాలలో పని చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్, సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లకు వెంటనే జీతాలు ఇవ్వాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నెల్లిమర్ల సిహెచ్‌సి ఆసుపత్రి దగ్గర నిరసన ధర్నా చేపట్టారు. అనంతరం బుగత అశోక్ మాట్లాడుతూ హాస్పిటల్స్‌లో ఉన్న పేషెంట్లకి ఇబ్బంది కలగకుండా, ప్రాణాలు లెక్కచేయకుండా పనులు చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులు, సూపర్వైజర్లు జీవితాలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నెల్లిమర్ల నాయకులు మొయిద పాపారావు, ఆసుపత్రి పారిశుధ్య, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ వర్కర్స్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులన్నీ పరిష్కరించాలి

ఎస్‌పి మాధవరెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మాధవరెడ్డి

జిల్లాలో అన్ని పోలీస్‌స్టేషన్లలో ఉన్న పెండింగ్ కేసులన్నీ తక్షణమే పరిష్కరించాలని ఎస్‌పి మాధవరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం పోలీస్ అధికారులతో పోలీసు మల్టీఫంక్షన్ హాలులో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా పొగాకు నియంత్రణ చట్టాల ఫేంబోర్డులు ఆవిష్కరించారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, ప్రస్తుత కేసుల స్థితిగతులు, నమోదైన కేసుల్లో నేరస్తుల అరెస్టు, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై సంబంధిత పోలీస్ అధికారులను ఆరా తీసి కేసుల ఫైల్స్, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల ఛేదింపునకు, పరిష్కారానికి, నేర నియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు, మెలకువలను అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఏదైనా ఒక ఫిర్యాదు నమోదైతే సంబంధిత సమగ్ర సమాచారాన్ని సేకరించి ఆ సమస్యను సత్వరమే పరిష్కరించేలా ఎస్‌హెచ్‌ఒలు కార్యాచరణను అమలు చేయాలన్నారు. నేర సమీక్షలో పొగాకు నియంత్రణ చట్టాల గురించి డిపిఎం డాక్టర్ వినోద్ అవగాహన కల్పించారు. సమావేశంలో ఎఎస్‌పిలు దిలీప్ కిరణ్, సునీల్ షరోన్, డిఎస్‌పి జి.వికృష్ణారావు, సిఐలు సిహెచ్.లక్ష్మణరావు, బి.ఎం.డి.ప్రసాద్‌రావు, ఎఆర్ ఆర్‌ఐ శ్రీరాములు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని ఉన్న 17 రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచినట్లు ఎఒ నాగేశ్వరరావు తెలిపారు. యూరియా 250 టన్నులు, డిఎపి 126 టన్నులతోపాటు ఇతర ఎరువులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎరువులు, పురుగు మందులను దుకాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇంటి వద్దకే పింఛన్లు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలోని 30 వార్డుల్లో 5,507 మంది పింఛనుదారులకు గురువారం ఉదయం ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వచ్చిన పింఛన్లు అందజేస్తారని, ఎవరూ సచివాలయానికి రావాల్సిన అవసరం లేదని చెప్పారు.

ఆత్మలకూ పింఛన్ల పంపిణీ

- మరణ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చిన వారే పింఛన్లు అందజేత
- సుమారు రూ.12 లక్షల అక్రమాలు
- పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి

ప్రజాశక్తి - కురుపాం

చనిపోయిన వారి పేరును పింఛన్లు పంపిణీ చేసి సరికొత్త రికార్డు సృష్టించారు పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలంలోని నీలకంఠపురం పంచాయతీ సచివాలయ సిబ్బంది. గత పదిరోజులుగా మండలంలోని 23పంచాయతీలలో పింఛన్ల పంపిణీపై చేపట్టిన సామాజిక తనిఖీలో పలు పంచాయతీల్లో అక్రమాలు జరిగినట్లు గుర్తించారు.

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం డ్వామా పీడీ రామచంద్రరావు ఆధ్వర్యాన నిర్వహించిన ప్రజా వేదికలో ఈ అక్రమాలను తనిఖీ బృందం బహిర్గతం చేసింది. నీలకంఠాపురం పంచాయతీ తో పాటు పలు పంచాయతీల్లో ఈ తరహా అవినీతి జరిగిందని తెలిపారు. నీలకంఠాపురం పంచాయతీ పరిధిలో 39మంది చనిపోయిన వారికి డిబిటి ద్వారా 6లక్షల 93వేల రూపాయలను వారి ఖాతాల్లో జమ చేశారు. ఇద్దరు ఉద్యోగుల కుటుంబ సభ్యులకు రూ.36వేలు, మృతి చెందిన తర్వాత 16మంది పింఛను దారులకు రూ.4.52లక్షలు నేరుగా డ్రా చేసినట్లు సామాజిక తనిఖీ ఎస్‌ఆర్‌పి దాసు తెలిపారు. అంతేకాకుండా ఉపాధి పనుల్లో పలు అక్రమాలను గుర్తించామని బృందం సభ్యులు తెలిపారు.

వీటిపై సమగ్రమైన నివేదిక డిఆర్‌డిఎకు పంపుతామని డ్వామా పీడీ రామచంద్రరావు తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు, రికార్డు నిర్వహణలో నిర్లక్ష్యం, ఇతర అక్రమాలు గుర్తిస్తే శాఖ పరమైన కఠిన చర్యలు తప్పవని అన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్

డిసిసిబిలో డిపాజిట్లు పెంచాలి

మహాజన సభలో పర్సన్ ఇన్‌ఛార్జి కార్తీక్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో డిపాజిట్లు, పెట్టుబడులను పెంచేందుకు కృషి చేయాలని ఆ బ్యాంకు పర్సన్ ఇన్‌ఛార్జ్, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ కోరారు. బ్యాంకు మహాజన సభ బుధవారం బ్యాంకు సమావేశమందిరంలో జరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు సాధించిన ప్రగతి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యకలాపాలు, తీసుకోవాల్సిన చర్యలను ఇన్‌ఛార్జి సిఇఒ సిహెచ్ ఉమామహేశ్వరరావు వివరించారు. బ్యాంకు 107వ వార్షిక నివేదికను సభ్యుల ముందుంచారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ, డిసిసిబి వ్యాపారం మునుపటి ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే, గత ఆర్థిక సంవత్సరంలో 14.3శాతం వృద్ధి సాధించడం శుభపరిణామమని పేర్కొన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.183865.32 లక్షలు కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.210153.21 లక్షలు వ్యాపారం జరిగిందని తెలిపారు. అదే సమయంలో బ్యాంకు సొంత నిధులు 14.14 శాతం వృద్ధితో, రూ.16412.38లక్షలు నుంచి రూ.18732.46 లక్షలకు పెరిగాయని చెప్పారు. బ్యాంకు డిపాజిట్లు రూ.27654.41 లక్షలు నుంచి 9.27శాతం వృద్ధితో రూ.30218.44లక్షలకు పెరిగాయని తెలిపారు. బ్యాంకు పెట్టుబడులు 16.36 శాతం, ఆప్కాబ్ వద్దనుంచి రుణాలు సుమారు 17.5 శాతం పెరిగాయని తెలిపారు. బ్యాంకు 2022-2023 ఆర్థిక సంవత్సరంలో 729.37 లక్షల నికల లాభాన్ని ఆర్జించగా, 2023-24 సంవత్సరంలో 746.26లక్షల నికర లాభాన్ని ఆర్జించిందని వివరించారు. డిపాజిట్లను మరింత పెంచేందుకు కృషి చేయాలని కోరారు. పిఎసిఎస్‌లను కంప్యూటరీకరించాలని జెసి సూచించారు. నాబార్డు డిడిఎం నాగార్జున మాట్లాడుతూ, డిసిసిబి బ్యాంకు పరపతిని పెంచాలని కోరారు. బ్యాంకు సుమారు రూ.1528 కోట్లు నాబార్డు ద్వారా రీఫైనాన్స్ చేస్తోందన్నారు. పిఎసిఎస్‌లు ఆదాయం పెంచుకొని బలోపేతం కావాలని సూచించారు. జిల్లా సహకార అధికారి రమేష్ మాట్లాడుతూ, జిల్లాలో 65 ప్రాథమిక సహకార సంఘాలు ఉండగా, వీటిలో కేవలం 10 మాత్రమే లాభాల్లో ఉన్నాయని, మిగిలిన వాటిని కూడా లాభాలబాట పట్టించడానికి కృషి చేయాలని కోరారు. బైద్యనాధన్ కమిషన్ సిఫార్సుల మేరకు నష్టాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సభలో పార్వతీపురం మన్యం జిల్లా సహకార అధికారి శ్రీరామ్మూర్తి, డిసిఎఒ శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్‌ల పర్సన్ ఇన్‌ఛార్జులు, డిసిసిబి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం

జిసిసి డిఎం మహేంద్ర కుమార్


బియ్యాన్ని పరిశీలిస్తున్న జిసిసి డిఎం మహేంద్ర కుమార్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జిసిసి సేల్స్‌మెన్లు, కాంట్రాక్టు సేల్స్ మెన్లు, డీలర్లు, ఎస్‌హెచ్‌జి గ్రూప్ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అలసత్వం వహించిన సహించేది లేదని జిసిసి పార్వతీపురం డిఎం మహేంద్ర కుమార్ హెచ్చరించారు. బుధవారం గుమ్మలక్ష్మీపురం బ్రాంచిలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమయపాలన పాటించాలని, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. నిత్యావసరాలను ఎండియు నిర్వాహకులతో సంయుక్తంగా ప్రజలకు సకాలంలో అందించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరల పట్టిక ఏర్పాటు చేయాలని, ప్రజలకు, గిరిజనులకు ఎటువంటి ఇబ్బందీ కలిగించవద్దని ఆదేశించారు. రానున్న ఎంఎఫ్‌పి సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని అమ్మకాలు చేపట్టాలన్నారు. గ్యాస్ పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని సంబంధిత జిసిసి మేనేజర్ కృష్ణప్రసాద్‌కు సూచించారు. జిసిసి గోదాములు, పెట్రోల్‌బంక్ పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు.

బోధన సామర్థ్యం మెరుగుకు చర్యలు

ఐటిడిఎ పిఒ రాహుల్

ప్రజాశక్తి-సీతంపేట


పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ టి.రాహుల్ కుమార్ రెడ్డి

ఐటిడిఎ పరిధిలో ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సిఆర్‌టిల బోధనా సామర్థ్యం మెరుగుదలకు చర్యలు తీసుకొంటామని ఐటిడిఎ పిఒ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. అందులో భాగంగా బుధవారం సిఆర్‌టిలకు వైటిసిలో సామర్థ్య పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సామర్థ్య పరీక్ష ద్వారా సిఆర్‌టిల బోధనా సామర్థ్యం తెలుస్తుందని చెప్పారు. ఈ పరీక్షలో తక్కువ మార్కులు వచ్చిన వారికి మెరుగైన శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ నారాయుడు, ఎఎంఒ కోటిబాబు, సిఎంఒ చిరంజీవులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఆశాల వినతి


ఎమ్మెల్యేకు వినతి అందిస్తున్న ఆశాలు, సిఐటియు నాయకులు


ప్రజాశక్తి-పాలకొండ

ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణ రావు, ఆశావర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.గౌరీశ్వరి, తదితరులు.. బుధవారం స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయక్రిష్ణను కలిసి వినతి పత్రం అందించారు. ఆశావర్కర్లకు కనీస వేతనాలను చెల్లించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా మార్చాలని కోరారు. సంబంధం లేని పనులు అప్పగించరాదని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఆశాల నియామకంలో రాజకీయం జోక్యం తొలగించాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో వెంకటమ్మ, భానుప్రియ, క్రిష్ణవేణి, లక్ష్మి, శాంతి, రాధారాణి, తదితరులు ఉన్నారు

ఆశ్రమ పాఠశాలను మార్చాలని వినతి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

కొమరాడలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను కెజిబివి పక్కనే ఉన్న బాలికల పాఠశాల వద్దకు మార్చాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి బుధవారం ఆర్‌డిఒ కె.హేమలతకు వినతి అందజేశారు. 50 ఏళ్లనాటి శిథిల భవనంలో తరగతులు నిర్వహించడం, పక్కనే బాలుర పాఠశాల ఉండటంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో స్పందన కార్యక్రమంలో వినతి అందిస్తే, పూర్వ కలెక్టర్ నిశాంత్‌కుమార్ పరిశీలించి, బాలికల పాఠశాల వద్దకు మార్చాలని గుమ్మలక్ష్మీపురం ఎటిడబ్ల్యుఒను ఆదేశించారని గుర్తుచేశారు. అయినా నేటికీ చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వివరించారు. వెంటనే ఆర్‌డిఒ స్పందిస్తూ చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.


ఆర్‌డిఒకు వినతి అందిస్తున్న సిఐటియు జిల్లా నాయకులు సాంబమూర్తి

జిఒ 85పై పునరాలోచించాలి


ఎమ్మెల్యే జగదీశ్వరికి వినతి ఇస్తున్న వైద్యులు


ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వ వైద్యుల పిజి ప్రవేశం కోసం తెచ్చిన ఇన్‌సర్వీస్ కోటాను తగ్గిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 85పై పునరాలోచన చేయాలని ఎమ్మెల్యే జగదీశ్వరికి ప్రభుత్వ వైద్యుల సంఘం సభ్యులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒ 85ను వెనక్కి తీసుకొని, ఇన్‌సర్వీస్ కోటాను గతం మాదిరిగా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బి.ప్రజ్ఞ, బుద్దేశ్వరరావు, హర్ష, అమరసింహారెడ్డి, రవి, ప్రవీణ్, పావని ఉన్నారు.

బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానిక ఎస్‌కోట డిపో నుంచి విశాఖకు సరికొత్త అల్ట్రా పల్లెవెలుగు బస్సును స్థానిక డిపో మేనేజర్ కె. రమేష్ అధ్యక్షతన ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ బస్సు ప్రతి రోజు ఎస్. కోట నుంచి విశాఖకు ఉదయం 7.45, 11.30, 3.20 నిముషాలకు, విశాఖ నుంచి తిరిగి ఎస్.కోటకు 9.45, 1.35, 5.15 నిముషాలకు ఉంటుందని చెప్పారు. ఎస్.కోట నుంచి విశాఖకు 65 రూపాయలు, కొత్తవలసకు 35 రూపాయలు, కొత్తవలస నుంచి విశాఖపట్నంకు 40 రూపాయలు చార్జీ వసూలు చేస్తారని చెప్పారు. ఈ సందర్భంగా డిపోకు మరిన్ని బస్సులు, సిబ్బందిని కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, డిపో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


గౌరీశంకర్ దంపతులను సన్మానిస్తున్న సూపరింటెండెంట్లు, వైద్యాధికారులు

గౌరీశంకర్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-సీతంపేట

డాక్టర్ గౌరీశంకర్ సేవలు మరువలేనివని పాలకొండ, సీతంపేట ఏరియా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు నాగభూషణం, బి.శ్రీనివాసరావు కితాబిచ్చారు. సీతంపేట ఏరియా ఆసుపత్రి ఆర్‌ఎంఒ, మత్తు వైద్య నిపుణులు వారణాసి గౌరీ శంకర్ ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం సన్మానసభ నిర్వహించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 28 ఏళ్లు పేదలకు అనేక సేవలు అందించారన్నారు. ముక్కుసూటుగా వెళ్తారని, 28 ఏళ్ల సర్వీసులో ఎటువంటి మచ్చలేదని తెలిపారు. ఆయన చేసిన సేవలు గుర్తింపునిచ్చాయన్నారు. అనంతరం గౌరీశంకర్ దంపతులను ఘనంగా సన్మానించారు. వైద్యాధికారి దంపతులకు వైద్యులు మెమోంటోను బహూకరించారు.

ఈ కార్యక్రమంలో విశ్రాంతి డిఎంహెచ్‌ఒ బగాది జగన్నాథరావు, వైద్యులు రాజేష్, శ్రీనివాసరావు, సునీల్‌కుమార్, నిరోషా, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని ఆర్.వెంకంపేట రైల్వేగేటు సమీపంలో పట్టాలు దాటుతున్న పి.పోలిశెట్టి (60)ని గుర్తు తెలియని రైలు ఢీకొంది. దీంతో అక్కడికక్కడే ఆయన మృతిచెందాడు. ఆర్.వెంకంపేటకు చెందిన పోలిశెట్టి బుధవారం చినభోగిలిలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. రైలు పట్టాలు దాటుతుండగా పార్వతీపురం నుంచి బొబ్బిలి వైపు వస్తున్న గుర్తు తెలియని రైలు ఢీకొంది. రైల్వే కీమ్యాన్ అందించిన సమాచారం మేరకు ఎస్‌ఐ రవివర్మ కేసు నమోదు చేశారు. శవపంచనామా నిమిత్తం మృతదేహాన్ని బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.


మృతిచెందిన పోలిశెట్టి